వేదాంతభేరి

డిసెంబరు 2019

రూ. 10/-

Scanned by CamScanner

స్వామి వివేకానంద ప్రపంచ మత మహాసభలో ఉపన్యసించిన దిన
125వ వార్షికోత్సవ సందర్భంలో శ్రీకాళహస్తి పురవీధులలో స్వామి వివేకానందరథయాత్ర

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము:52 డిశంబర్ 2019 సంచిక : 12

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 దాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

Scanned by CamScanner

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 | డిశంబర్ 2019 | సంచిక : 12

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. గీతోపనిషత్తు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు -06
03. గీత యొక్క మహిమ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10
04. శ్రీరామకృష్ణ బోధామృతం - శ్రీరామకృష్ణ పరమహంస -12
05. ప్రరోచనము - స్వామి సర్వాత్మానందగిరి -14
06. భాగవతం షష్ఠస్కంధము - శ్రీమాతా పరావిద్యానందగిరి -19
07. సంఘ సంస్కరణ దీక్షా దక్షులు- కందుకూరి, మలయాళస్వామి - 24
- డా॥ సముద్రాల లక్షణయ్య
08. ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము - 28
09. దత్తాత్రేయుని ఆవిర్భావం - డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ - 29
10. ఉద్ధవ గీత - యేలేశ్వరపు హనుమ రామకృష్ణ -36
11. వైరాగ్యమనగా! - కె. ఈశ్వర్ - 36
12. వార్తలు - 42

ముఖచిత్రం -

శ్రీ మద్భగవద్గీతోపదేశము

02-12-2019వ తేది సోమవారం - స్కందషష్ఠి

07-12-2019వ తేది శనివారం - గీతాజయన్తి

11-12-2019వ తేది బుధవారం - దత్తాత్రేయ జయన్తి

16-12-2019వ తేది సోమవారం - ధనుర్మాసారంభం

26-12-2019వ తేది గురువారం - సూర్యగ్రహణము

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓం దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్తవత్సలమ్ ।
ప్రపన్నార్తిహరం వందే స్మర్తృగామీ స నో వతు ॥

2. ఓం శుద్ధాం సనాతనీం అమ్బాం శోకమోహవినాశినీమ్ ।
కృష్ణస్వరూపిణీం గీతాం ఇష్టదేవీం భజామ్యహమ్ ॥

జయ జయ జయ జయ భగవద్గీతే !

జయ భవబన్ధన శమన సుచరితే !

1. కాండత్రయ సంశోభితరూపే ! ఖండిత త్రిభువన ఘనసన్తాపే !
2. సాంఖ్య కర్మయోగాది విలసితే ! సంశ్రిత సాధక జనకల్పలతే !
3. పద్యసప్తశత భవ్యతరాంగే ! పాప విభఞ్జన పావనగంగే !
4. భక్తిజ్ఞాన సోపాన శోభితే ! పరమయోగి హృత్పద్మభావితే !
5. భగవత్ శ్రీముఖ పద్మమరన్దే! పార్థహృత్సదన భరితానన్దే!
6. సకలోపనిషత్ సాగరజాతే ! సన్మునిమథనాచల పరిపూతే ॥
7. శాన్తిసుఖప్రద పదమృతకిరణే ! జనన మరణ భవసాగర తరణే !!
8. భజన సమాజ సుభక్త హృదబ్జే ! పరిపూజిత పావన పదాబ్జే ॥

- రచన శ్రీ నోముల అప్పారావు

కృతజ్ఞతలు

వేదాన్తభేరికి తమ విలువైన వ్యాసాలను అందించిన రచయితలకు హృత్పూర్వక కృతజ్ఞతలు. అట్లే పత్రికను పోషించుచున్న చందాదారులకు, పోషకులకు ప్రకటన నిచ్చి సహకరించిన సుభద్రా చారిటబుల్ ట్రస్టు (హైద్రాబాద్) వారికి కృతజ్ఞతాభివందనములు. మీరందరు ఇక మీదట గూడ మీ సహకారాన్ని పత్రికకు అందించగోరుచున్నాము.

- వేదాన్తభేరి ప్రచురణ కర్తలు

Scanned by CamScanner

గీతోపనిషత్తు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

గీతను గూర్చిన కొన్ని వైచిత్ర్యములను పరిశీలించెదము - విష్ణు భగవానుని నాభికమలమునుండి బ్రహ్మదేవుడావిర్భవించెనని శాస్త్రములందు ప్రతీతి. బ్రహ్మదేవుని వలన వేదములుత్పన్నమైనవనియు లోకమున విఖ్యాతి. భగవద్గీతయో అట్లుకాక విష్ణుమూర్తియొక్క ముఖకమలమునుండియే నేరుగ జనించినది. ఎక్కడ ముఖకమలము! ఎక్కడ నాభికమలము! ఏది సమీపము? కావున వేదములకంటెను గీత భగవానునకు సన్నిహితమైన స్థానము నాక్రమించుకొనినదని స్పష్టమగు చున్నది. ఈ యర్థమే ఈ క్రింది మహాభారత వాక్యములందు ధ్వనించు చున్నది.

గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర విస్తరైః

యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిఃసృతా (భారతం-భీష్మ పర్వము 4-31)

"గీతను లెస్సగ గానమొనర్పవలెను. ఇతర శాస్త్రములచే నేమి ప్రయోజనము? ఏలయనిన, గీత స్వయముగ విష్ణుభగవానుని ముఖ కమలము నుండియే వినిర్గతమైనది." గీతయొక్క మహిమను వర్ణించుటకు ఇంతకంటె అధికమగు ప్రమాణమేమికావలెను? కొందఱు గీతను స్మృతిక్రింద పోల్చి చెప్పుదురు. ఈశ్వర నిశ్వాసము శ్రుతి అయినపుడు, ఈశ్వరవాణి స్మృతి యెట్లు కాగలదని వల్లభాచార్యులు నిలదీసి ప్రశ్నించిరి. మఱియు భగవద్గీత ప్రతి అధ్యాయము యొక్క చివఱ- 'ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు= బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే...'

అను సంకల్పము గలదు. దానిలో ఉపనిషత్సు ='ఉపనిషత్తులలో' అని చెప్పబడి యుండుటవలన, గీత వేదము యొక్క అంతమగు ఉపనిషత్తులలో చేరినదేయని స్పష్టమగుచున్నది. కాబట్టి దీనిని 'గీతోపనిషత్తు' అనినను తప్పులేదు. వేదముల వలెనే ఇదియు అమరవాణియనుటలో ఏ సందేహమున్ను లేదు.

అధ్యాత్మ వాఙ్మయమున ముముక్షువులకు ప్రస్థానత్రయము అతి ముఖ్యమగు ఆలంబనమైయున్నది. ప్రస్థానత్రయముయొక్క పరిచయము లేనిచో పరమార్థతత్త్వము చక్కగా బోధపడదు. దశోపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రములు- అను నీమూడును కలిసి ప్రస్థానత్రయమనబడును. గీత అనేక ధర్మసూక్ష్మములతో నిండినిబిడీకృతమైయున్నది. కనుకనే గీత ప్రస్థాన త్రయములో చోటును సంపాదించుకొనగల్గినది. ఈ మూడిటి యందునుగూడ ఉపనిషత్తులయొక్కయు, బ్రహ్మసూత్రముల యొక్కయు భావములు గీతయందుండుటచేతను, భాషను, శైలి సులభముగ నుండుట చేతను గీత జనులలో విశేష వ్యాప్తినొందినది.

మఱియు "నేను గీత నాశ్రయించుకొని యున్నాను, గీత నాకు చక్కని మందిరము, గీతాజ్ఞానమునవలంబించియే ముల్లోకములను నేను పాలించుచున్నాను." అని గీతా మాహాత్మ్యమున విష్ణువు పలికిన వాక్యములు గీతయొక్క మహోన్నతస్థితిని, ప్రాధాన్యమును లెస్సగ చాటుచున్నవి. మఱియు గీతాసమాశ్రయముచే భగవంతుడు త్రిలోకములను, బ్రహ్మాండమునంతను పాలింపగల్గుచుండ, అద్దాని ఆశ్రయముచే మానవుడు ఒక చిన్న గృహమును పాలింపలేడా? కుటుంబమును పాలింపలేడా? తప్పక పాలింపగలడు. "భూభుజో జనకాదయః" అనునట్లు జనకాది మహారాజులు అట్లు పాలింపగల్గిరి. గీత నవలంబించి వారందఱున్ను తమతమ సంసారములను, తమతమ జీవితనౌకలను ఒడుదుడుకులు లేకుండ సాఫీగా నడుపుకొనగల్గిరి. కాబట్టి

తాపత్రయ విదగ్ధమగు ఈ ఘోరసంసారారణ్యమున దుఃఖరహితమగు ప్రశాంత జీవనము నభిలషించు ప్రతివారును గీతయొక్క సహాయము గైకొనియే తీరవలెను.

"గీతా రక్షతి రక్షితా" ఎవరు గీతను రక్షించుదురో వారలను గీత రక్షించును. అనగా గీత నెవరు ఆదరించుదురో, ఆశ్రయించుదురో, అనుష్ఠించుదురో వారలను గీత భవసాగరము నుండి కాపాడునని భావము. కనుకనే భయంకరమగు ఈ సంసారసముద్రము నెవడు దాటనిచ్ఛగించునో అతడు గీత యను నౌకను తప్పక ఆశ్రయించవలెనని శాస్త్రములుద్బోధించు చున్నవి.

సంసార సాగరం ఘోరం తర్తు మిచ్ఛతి యో నరః

గీతా నావం సమాసాద్య పారం యాతి సుఖేన సః (వైష్ణవీయతంత్రసారము)

కలికాలమున ధర్మము ఏకపాదమున నుండుననికాబోలు. లేక, కలి తన యావచ్ఛక్తితో విజృంభించి జనులను కుమార్గమున నడిపించి భ్రష్టులంజేయునని కాబోలు - దయార్ద్రహృదయుడగు పరమాత్మ కృష్ణావతారమునెత్తి నరిగా కలికాలమునకు ఒకింతముందే గీతామృతమును జనులకందజేసిరి.

కాకున్న, కృతయుగమున దీనిజోలికి యెందుకు పోలేదు? త్రేతాయుగమున దీనిమాట యెందుల కూహించలేదు? ద్వాపరయుగము చివఱవఱకు ఎందులకు వేచి యుండవలెను? రోగము ముదిరినప్పుడే చక్కని మందువేయవలెనని భావించినట్లున్నది. ఏది యెట్లున్నను, కలిదోషభయమిక జనులకు లేదు. మాంత్రికునకు గ్రహబాధ లేనట్లు గీతామంత్రమును జపించు మానవునికడకు సంసారదోషములు,

తాపములు వచ్చుటకు సాహసింపవు. ఒకవేళ వచ్చినను సమూలముగ విధ్వంసములై పోగలవు.

"పారమాత్రపరాభూత కాలకింకరగర్జితమ్" 'గీతాపఠన మాత్రముచే యమకింకరుల గర్జనలు వ్యర్థములై పోగలవు' - అని పద్మపురాణమున గీతామాహాత్మ్యమునందు తెలుపబడినది. గీతయందలి ప్రతి శబ్దమున్ను పాపమును భస్మీభూతమొనర్చు అగ్నికణమువంటిదని చెప్పుటలో అతిశయోక్తి లేదు. కావుననే పండితుడు మొదలుకొని పామరునివరకును, రాజు మొదలుకొని దరిద్రునివఱకును, భూసురుని మొదలుకొని చండాలుని వఱకును గల సమస్త మానవకోట్లున్ను గీత నాశ్రయించి దానివలన శాంతి సౌభాగ్యముల ననుభవించుచున్నారు. గీతాగంగాపానముచే ఇదివఱకెందఱో తరించిరి, ఇపుడును తరించుచున్నారు. ముందును తరింపగలరు. శ్రీశంకరాచార్యులు గీతాప్రశస్తిని గూర్చి యివ్విధముగ తెలిపియున్నారు.

భగవద్గీతా కించిదధీతా

గంగాజలలవకణికా పీతా

సకృదపియేన మురారి సమర్చా

తస్యకరోతి యమోఽపి న చర్చామ్.

భగవద్గీతను ఒకింత అధ్యయనము చేసినను, గంగాజలమును కొద్దిగా త్రాగినను, విష్ణుభగవానుని ఒక్క పర్యాయము పూజించినను, ఇక యముడు వారి చెంతకు పోనేరడు. కాబట్టి గీతపై పూర్ణవిశ్వాసముంచి, అందలి సత్యముల ననుష్ఠించి, నిరతిశయానంద మీజన్మయందే యనుభవించుటకు బద్ధకంకణులు కావలెను.

Scanned by CamScanner

గీత యొక్క మహిమ

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

గీత యొక్క మహిమ యంతయు అధ్యాయాంతమున గల సమాప్తి వాక్యము వలననే గనదగును. "ఇతి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే (అముక) యోగోనామ" అని ప్రతి అధ్యాయాన్తమున గలదు గదా! దీనిలో గీతార్థము పూర్ణముగా ఇమిడియున్నది. ఇచట "శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు" అని చెప్పుటలో భగవద్గీత ఉపనిషత్తులే గాని, సామాన్యమైనవి కావని అర్థమగుచుండును.

గీతాధ్యాన శ్లోకములలో "సర్వోపనిషదో గావః? అని ప్రయోగించుటకు గూడ అదియే కారణము. మఱియు "బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే- బ్రహ్మవిద్య యనియు, యోగశాస్త్రమనియు ప్రయోగించుట వలన ఇది బ్రహ్మవిద్యా స్వరూపమనియు, యోగశాస్త్ర మనియు తెలియదగును. ఇట్టి మహోన్నత గ్రంథమగుటచేతనే గీతకు ఇంత వ్యాప్తి గలిగినది. ఇంత విశాలార్థము, అగాధభావము, సమత్వమున్ను గల గ్రంథము మఱియొకటి లేదని చెప్పుట అతిశయోక్తి కానేరదు. కనుకనే శ్రీ ఆది శంకరాచార్యులు మొదలుకొని సామాన్య జనులు కూడ గీతాపఠనము నందాసక్తి గలిగియుండుటకు కారణమైనది. మతత్రయాచార్యులు ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత పరములుగా దీనికి అర్థములను (భాష్యములను) వ్రాసియుండుటయే గాక అనేకులు కర్మయోగపరముగాను, భక్తియోగపరముగాను దీనికి అర్థమును వ్రాసియున్నారు. శ్రీకంఠ శివాచార్యులు శివపరముగా భాష్యమును రచించి యున్నారు.

గీతాబోధ గొప్ప వెల్లువ వంటిది. నూయి, గుంట, చెఱువు మొదలగు

వాటి విస్తీర్ణము ననుసరించి జలము వాటిలో నిలచి మిగిలిన జలమంతయు సముద్రములోనికి వెళ్ళునట్లు ఎవరెవరి హృదయము ఎంత విశాలముగా నుంటున్నదో అంత అర్థమును వారు గ్రహించగలరు. మిగిలినదంతయు అనంతములోనికి పోయి చేరుచుండును. స్వల్పాహారముచే చీమ తృప్తి నొందునట్లును, గొప్ప (ఎక్కువ) ఆహారముచే ఏనుగు సంతుష్టి నొందునట్లును ఎవరెవరి హృదయ భావము ఎంత విశాలముగా నుండునో దాని ననుసరించి గీతాపఠనము చేయు వారందఱున్ను అంతంత సంతృప్తులగుచున్నారు. కడుపు నిండినచో గజము (ఏనుగు)నకు ఎట్లు సుఖముండునో అదేవిధంగా పిపీలికకున్ను తృప్తి యుండును. ఏలాంటి మార్పున్ను లేదు.

కొన్ని గ్రంథములు కొందఱికి మాత్రమే పఠించుటకు అధికారము గలిగియున్నట్లు ఆయా గ్రంథములలోనే నిరూపించి యున్నారు. గీతలో అట్టి సంకుచిత భావమేమియు లేదు. భూపాలుర నుండి గోపాలుర వఱకును, పండితుల నుండి పామరుల వఱకును, ఉన్నత జాతుల నుండి నిమ్నజాతుల వఱకున్ను, సన్న్యాసుల నుండి గృహస్థుల వఱకున్ను వెయ్యేల ఆబాల వృద్ధ స్త్రీ పురుషులందరున్ను కట్టకడకు మనుష్య మాత్రులెవరైనను, ఏ మతస్థులైనను పఠించి అనుష్ఠించి తరించుటకు అవకాశం గలదు. కావున ముముక్షువులందఱు గీతార్థమును తెలిసికొని ఆచరించి తరించగలరు. ఓం తత్సత్ ఓమ్

విజ్ఞప్తి

వేదాన్తభేరి సంవత్సర చందాదారుల వార్షిక చందా ఈ డిశంబరుతో ముగిసినది. కాబట్టి సంవత్సర చందాదారులు తమ తమ చందా నూరు రూపాయలను 25-12-2019వ తేది లోపల మాకు చేరేటట్లు మనియార్డరు ద్వారా పంపగోరుచున్నాము. – వేదాన్తభేరి పబ్లిషర్

Scanned by CamScanner

శ్రీరామకృష్ణ బోధామృతం

- శ్రీ రామకృష్ణ పరమహంస

శ్రీరామకృష్ణులు : చాతకపక్షి దాహంతో గొంతు ఎండిపోతున్నా గానీ ఏ నీటినీ తాగదు. స్వాతి నక్షత్రం నాడు కురిసే వాననీటికై ఎదురుచూస్తూ ఉంటుంది. దాని అర్థం - అన్య విషయాలపట్ల ఆసక్తి లేకుండా, కేవలం భగవంతుని పాదపద్మాలపట్ల మాత్రమే భక్తి కలిగి ఉండడమని.

భగవన్నామంతో మనిషి పావనుడవుతాడు. అందుచేతనే భగవన్నామ కీర్తనను అభ్యసించాలి. నేను యదుమల్లిక్ తల్లితో ఇలా అన్నాను. మృత్యువు ఆసన్నమైనప్పుడు, మనసులో ఈ సంసారం గురించిన చింతయే కలుగుతుంది. కుటుంబం, పిల్లలు, వీలునామా వ్రాయడం మొదలైన లౌకిక భావనలే మనస్సులో మెదలుతాయి. భగవంతుని గురించిన చింతనే రాదు. భగవన్నామ జపం, భగవన్నామ కీర్తనం అభ్యసించడం ద్వారా లౌకిక భావాలు తొలగిపోతాయి. ఈ అభ్యాసం కనుక ఉంటే మరణ సమయంలో భగవంతుని నామమే నాలుకపైకి వస్తుంది.

ఏకాంతవాసం చేస్తూ కేవలం భగవత్ చింతన, ఆయన నామజపం చేయాలి. ఏకాంతంలో భగవచ్చింతన చేయమనీ, నామజపం చేయమనీ ఎందుకు చెబుతున్నానో తెలుసా? రేయింబవళ్ళూ సంసారంలో ఉంటున్నప్పుడు అశాంతి ఏర్పడుతుంది. చూడండి, ఒక అడుగు భూమికై సోదరులు తన్నుకొని రక్తపాతం చేసుకుంటున్నారు. 'భూమి, స్త్రీ, ధనం- ఈ మూడింటి కోసమే ఈ కొట్లాటలూ, గందరగోళమూ, అశాంతి అంతా'.

మీరు సంసారంలో ఉన్నారు. సరే, అయితే అందుకు భయపడడం ఎందుకు? రాముడు సంసారాన్ని త్యజించాలనుకొన్నప్పుడు, వసిష్ఠుడు రాముడితో 'రామా! నువ్వెందుకు సంసారాన్ని పరిత్యజించాలి? ప్రపంచం భగవంతుని నుండి భిన్నమైనదా ఏమిటి? దేన్ని త్యజిస్తావు, దేన్ని స్వీకరిస్తావు? భగవంతుడు తప్ప మరేదీ లేదు! జీవ జగత్తులన్నింటా ఆ భగవంతుడే భాసిస్తూన్నాడు' అని అన్నాడు.

సాధన కాలంలో ఈ జగత్తు 'మాయామందిరం'గా తోస్తుంది. భగవద్దర్శనానంతరం ఈ జగత్తేఆనందసౌధం'గా మారిపోతుంది.

శ్రీరాముడు లక్ష్మణునితో 'ఎక్కడ ప్రగాఢ భక్తి ఉంటుందో అక్కడ నేను ఉంటానని తెలుసుకో' అని చెప్పాడు. అది చైతన్యదేవులకున్న భక్తి వంటిది. ఆయన భక్తిపారవశ్యంలో నవ్వారు, విలపించారు, నృత్యం చేశారు, పాడారు. ఆయన అవతారపురుషుడు. భగవంతుడు ఆయన రూపంలో ఈ లోకాన అవతరించాడు.

Arise, Awake and stop not tll the goal is reached. Arise, awake, awake from this hypnotism of weaknes.. None is really weak. The soul is infinite, omnipotent, omniscient. Stand up, assert yourself, Proclaim the God within you, do not deny Him !

లెమ్మె! మేలుకొనుము! గమ్యము చేరువఱకు నిలువకుము! లెమ్ము ఈ దుర్బలత్వమను మైకమునుండి మేల్కాంచుము! మేల్కాంచుము! ప్రపంచములో యెవరును దుర్బలులు కారు. ఆత్మ అనంతము, సర్వ శక్తి యుతము, సర్వజ్ఞము అయియున్నది. కాబట్టి లెమ్ము! నీ ఆత్మశక్తిని ప్రకటింపుము! నీలో నున్న దైవమును చాటుము! ఆతనిని యెన్నడును తిరస్కరింపకుము. - స్వామి వివేకానన్ద

ప్రరోచనము

\- స్వామి సర్వాత్మానందగిరి

" భగవద్గీతా కించిదధీతా గంగాజల లవ కణికా పీతా

సకృదపి యేన మురారి సమర్చా తస్య కరోతి యమేన న చర్చా॥"

'ఎవరి చేత భగవద్గీత ఏ కొద్దిగా అధ్యయనం చేయబడినా, గంగాజలం ఒక్కబొట్టు తాగబడినా, ఒక్కసారి శ్రీకృష్ణుడు బాగా అర్చించబడినా, యముడిచేత అతడి యొక్క చర్చ చెయ్యబడదు' అని పై శ్లోక తాత్పర్యము. ఇది జగద్గురువులైన శ్రీమత్ శంకర భగవత్పాదాచార్యులు లోకానికి బోధించిన హిత వాక్యము. భగవద్గీతకు ఈవిధంగా ఇక్కడ మొదటి స్థానం ఇవ్వబడింది.

'భగవద్గీత' అంటే ఏమిటి? భగవంతుడి నిశ్శ్వాసం (బయటికి వచ్చిన శ్వాస వాయువు) నుంచి పుట్టింది వేదము. అది విజ్ఞాన సర్వస్వము, భగవంతుడి రూపము. సృష్టికర్త ఐన చతుర్ముఖ బ్రహ్మ ఆయననుండి ఆ వేదాన్ని విని తన సంతానానికి తెలిపాడు. బ్రహ్మచేత విని గ్రహించబడింది. కాబట్టి దానికి శ్రుతి అని పేరు కలిగింది. అప్పటి నుంచీ తండ్రి నుంచి కొడుకుకు అనే పరంపరగా చెప్పబడుతూ వచ్చింది వేదం. కాల ప్రభావం వలన మేధస్సు యొక్క శక్తి తరిగిపోతున్న సమయంలో భగవదవతారమైన పరాశర మహర్షి కొడుకైన కృష్ణ ద్వైపాయనుడు ఆ వేదాన్ని సులభంగా ధారణ చెయ్యడానికి అనుకూలంగా, నాలుగు భాగాలుగా విభజించాడు. ఆ విధంగా చేసినందున అతడికి వేదవ్యాసుడు (వేదాన్ని విభాగించినవాడు) అని పేరు కలిగింది. ఋగ్యజుస్సామాధర్వణాలన్న ఆ నాలుగు వేదాల అధ్యయనం, అధ్యాపనము కేవలం బ్రాహ్మణ వంశాలకే పరిమితం చెయ్యబడ్డాయి. వాళ్ళ మేధస్సు దానికి అనుకూలంగా వుండడం వలన.

శ్రుతుల యొక్క ప్రయోజనం ఏమిటి? మానవులందరూ తమతమ కోరికలకు తగినటువంటి ఇహపరసుఖాలను సంపాదించుకొని సంతోషంగా జీవనం చేయ్యడమే. అందుకని అందరూ ఆచరించవలసిన అనేక కర్మలు, వాటి విధానాలు, ఆ కర్మలాచరించినందున లభించే ఫలాలు వేదంలో విస్తారంగా వివరించబడ్డాయి. ఈ వేదభాగానికి 'కర్మకాండ' లేక 'పూర్వ మీమాంస' అని పేరు.

వేదాన్ని అధ్యయనం చేసే అధికారము, సామర్థ్యము లేని వాళ్లందరి కోసము ఒక లక్ష శ్లోకాలతో 'మహా భారత' ఇతిహాసాన్ని కూడా రచించారు వేదవ్యాసులు. మహాభారతము 'పంచమ వేదము' అని కూడా చెప్పబడింది. అంతేగాకుండా అష్టాదశ (18) పురాణాలను నాలుగు (4) లక్షల శ్లోకాలతో రచించి లోకానికి అందించారు. ఆ భగవదవతారమూర్తి పురాణాలన్నిటిలో గూడా వేదసారం, భగవంతుడి లీలావతార కథల ద్వారా, అందరూ అత్యంత సులభంగా అర్థం చేసుకునే విధంగా వర్ణించబడింది.

మనందరికీ బాగా అనుభవంలో వున్నట్టుగానే ఇహపరలోకాలలో గల సకల భోగాలు కాలగతిలో నశించిపోయేవేగాని వాటికి శాశ్వతత్వము లేదు. అందువలన సుఖాలనాశించే వాళ్ళందరూ కర్మలను చెయ్యడము, వాటి వలన కొన్ని సుఖాలను సంపాదించి అనుభవించడము, క్రమంగా అవి నశించిపోగానే తిరిగి కర్మలను ప్రారంభించడము అనే చక్రంలోనే తిరుగుతుంటారు. అదీ కాకుండా మనిషికి గల కోరికలు, సమస్యలు, వ్యాధులు, బాధలు అనే వాటికి ఒక పరిమితి వుండదు కదా! కొన్ని పరిష్కారం అవుతుంటే మరికొన్ని కొత్తవి తలెత్తుతూ వుంటాయి. బాగా పరిశీలిస్తే ఈ మార్గం (కర్మాచరణ)లో లభించే ఫలం కన్న మనిషి పడే ప్రయాసనే చాలా అధికంగా వుంటుందని బోధపడుతుంది, ఎందువలన? అంటే మనిషి మనసులో గల సుఖాభిలాష అతడిని అనేక రకాలైన యోనుల్లో కూడా తిప్పుతూ వుంటుంది.

Scanned by CamScanner

తత్త్వశాస్త్రాలు కూడా ఈ విషయాన్నే స్పష్టంగా తెలిపాయి.

మరైతే, మనిషి అనుభవించే అంతులేని ప్రయాసకు పరిష్కారం ఏంటి? అన్నదాని గురించి కూడా వేదమే సూచించింది. మనిషి ఎన్నడు పరమసత్యాన్ని గ్రహించగలుగుతాడో అప్పుడే అతడు సకల కోరికల నుంచి, సర్వదుఃఖాల నుంచి విముక్తిని పొంది శాశ్వతంగా ఆనందంలో వుండగలుగుతాడు. ఆ పరమసత్యాన్ని గురించి బోధించే శాస్త్రమే 'ఉపనిషత్తు. వెయ్యినూట ఎనభై (1180) శాఖలుగా విస్తరించిన వేదంలో ప్రతి శాఖకు ఒక్కటి చొప్పున (1180) ఉపనిషత్తులు ఆ పరమ సత్యాన్ని అనేక విధాలుగా, అనేకమైన స్వభావాలు గల మనుష్య కోటికి బోధిస్తున్నాయి. వేదంలో గల ఈ భాగానికి 'జ్ఞానకాండ' లేక 'ఉత్తర మీమాంస' అని పేరు. 'శారీరక మీమాంస' అన్న శబ్దం గూడా దీన్నే సూచిస్తుంది.

మహాభారతంలో కౌరవపాండవ సేనలు కురుక్షేత్రంలో యుద్ధం ప్రారంభించబోతున్న సమయంలో, గురువులు, తాతలు, తండ్రులు, సోదరులు, పుత్రులు, మనవళ్ళు, మిత్రులు, బంధువులు మొదలైన వాళ్ళు తన ఎదురుగా యుద్ధం చెయ్యడానికి నిలబడి వుండడం చూశాడు మహావీరుడైన అర్జునుడు. రాజ్యప్రాప్తి అనే స్వార్థం కోసం అందరు ఆత్మీయులను యుద్ధంలో చంపడానికి అతడి మనసు ఒప్పుకోలేదు. జరగబోయే యుద్ధంలో ఆత్మీయులందరి వధను తలుచుకొని అర్జునుడి మనసు తల్లడిల్లిపోయి మహావిషాదంలో మునిగిపోయింది. అటువంటి సమయాన ధర్మసంస్థాపన కోసం అవతరించిన శ్రీకృష్ణపరమాత్మ సర్వ ఉపనిషత్సారాన్ని అతి స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగాను బోధించి అర్జునుడికి కలిగిన విషాదాన్ని అంతం చేశాడు. పరమాత్మ స్వయంగా తన నోటి ద్వారా బోధించిన ఆ సత్యతత్త్వం లోకంలో భవిష్యత్తరాల కన్నిటికీ పరమలాభాన్ని కలిగించగలదనే ఉదారమైన ఉద్దేశ్యంతో దాన్ని 'భగవద్గీత' అనే నామంతో వేదవ్యాసులవారు ఏడువందల (700) శ్లోకాలతో తాను రచించిన మహాభారత

ఇతిహాసంలో పొందుపరిచాడు.

మనుష్యుల ఒక్క దుఃఖాన్నేగాక సర్వానర్థాలకు మూలమైన అజ్ఞానాంధకారాన్ని నాశనం చేసే సూర్యుడి వంటిది శ్రీమద్భగవద్గీత. అటువంటి భగవద్గీతాభ్యాసం వలన మనిషి మృత్యువును దాటిపోయి నిరతిశయానందమైన నిత్యానందంలో వుండిపోతాడు. సకల భూతాలకు మృత్యువును కలిగించేవాడు యముడు. అటువంటి యముడు భగవద్గీతా జ్ఞానాన్ని కొద్దిగానైనా పొందిన మహాత్ముడి గురించిన చర్చను కూడా చెయ్యడని, అంటే అటువంటివాడు మృత్యువును దాటి పరమపదంలో శాశ్వతంగా ఆనందిస్తాడని భగవత్ శంకరులవారి శ్లోకం చివరి పాదం తెలుపుతున్నది.

మనిషి అంటే ఎవరు? ప్రపంచం అంటే ఏమిటి? అది ఈనాడెందుకు ఇట్లా వున్నది? ప్రపంచం ఏవిధంగా సృష్టించబడింది? సుఖము, దుఃఖము, కామక్రోధలోభమోహాలు మొదలైనవి ఏమిటి? మనిషికివి కలగడానికి కారణమేంటి? వీటి వలన మనిషికి కలిగే హాని ఏమిటి? ఇవి ఏవిధంగా వదులుతాయి?

కర్మలు అంటే ఏమిటి? అవి ఎందుకు చెయ్యబడుతున్నాయి? చెయ్యగూడని కర్మలను మనిషి ఎందువలన మానుకోలేకపోతున్నాడు? ఎటువంటి కర్మలను చెయ్యాలి? ఎప్పటినుంచి మనిషి కర్మలనాచరిస్తున్నాడు? ఎప్పటి వరకు ఆచరిస్తాడు?

సత్యమైన ఆనందమంటే ఏమిటి? అది ఏవిధంగా లభిస్తుంది? అది ఎవరికి లభిస్తుంది? ఎప్పుడు లభిస్తుంది? ఎక్కడ లభిస్తుంది?

భగవంతుడంటే ఎవరు? ఆయనెక్కడ ఉన్నాడు? ఆయన మహిమ ఏంటి? ఆయననెట్లా చూడగలము? దేవతలంటే ఎవరు? ప్రకృతి అంటే ఏమిటి? మనిషి పుట్టుక ఎట్లా కలుగుతున్నది. మరణం ఎట్లా కలుగుతున్నది?

Scanned by CamScanner

మరణం తర్వాత ఏమి జరుగుతున్నది? స్వర్గ నరకాలన్నవి వున్నాయా?

సంసారమంటే ఏమిటి? పరమాత్మ భక్తి ఏమిటి? అజ్ఞానమంటే ఏమిటి? జ్ఞానమంటే ఏమిటి? శరీరము, ఇంద్రియాలు, మనస్సు అన్నవేంటి? వైరాగ్యమంటే ఏమిటి? సంన్యాసమంటే ఏమిటి. కర్మయోగము, బుద్ధియోగము, సాంఖ్యయోగము అన్నవేంటి? త్రిగుణాల శక్తి ఎటువంటిది? పరమపురుషార్థమంటే ఏమిటి?

సామాన్యులమైన మనందరి మనసుల్లో అనేకసార్లు తలెత్తుతున్న ఇటువంటి ఇంకా అనేకమైన ప్రశ్నలకు, సందేహాలకు భగవద్గీతలో చక్కటి సమాధానాలు చెప్పబడ్డాయి.

In you is all power, summon up your all powerful nature, oh mighty one, and and this whole universe will be at your feet, it is the self alone that predominates, and not matter,it is those foolish people who identify themselves with their bodies that piteously cry 'weak, weak, we are weak'. We want spirit, tremendous energy and boundless enthusiasm. No need of looking behind, March foward!

మిత్రుడా ! సమస్త శక్తియు నీయందే కలదు. వీరుడా! నీ యా మహత్తర ఆత్మ స్వభావమును ప్రత్యక్షము చేసికొనుము. అత్తఱి యీ విశ్వమంతయును నీకు పాదాక్రాంతమగును. వాస్తవముగా ఆత్మయే సర్వత్ర కలదు, కాని ప్రకృతి కాదు. దేహమే తామనుకొను పామరులే "మేము దుర్బలులము, దుర్బలులము! అని విలపించు చుందురు. మహాధీరత్వము, అఖండశక్తి సామర్థ్యములు, అపరిమితోత్సాహము మనకిపుడు కావలసియున్నవి. వెనుక చూపు పనికి రాదు. ముందునకే చనుడు!

– స్వామి వివేకానన్ద

భాగవతం షష్ఠ స్కంధము

– శ్రీ మాతా వరావిద్యానందగిరి

(గత సంచిక తరువాయి)

అజామిళునికి తాను చేసిన అధర్మమైన పాపకృత్యములన్ని కళ్ళకు కట్టినట్లు గోచరించుటచే పశ్చాత్తప్తుడయ్యెను. తనకు కనిపించిన యమ, విష్ణుదూతల సందర్శనము ఆలకించిన వారి సంభాషణ స్వప్నమా, నిజమా అని సందేహము కలిగెను. ఏమైననూ తాను చేసిన పాపకర్మలకు తప్పక నరకములో అనేక బాధలు పడవలసి వచ్చునని నిర్ధయమునకు వచ్చియూ ఈ జన్మలో నేను మహాపాపినైననూ పూర్వజన్మలలో తప్పక సత్కర్మలను ఆచరించియుందును. అట్లుకానిచో నాకు దేవతల దర్శనము కాబోదు. అత్యంత పాపినైననూ మరణ సమయమున నానోట భగవన్నామము వెలువడినదనిన నా పూర్వజన్మ పుణ్యఫలమే. సంశయములేదు అని నిశ్చయించుకొన్నవాడై వైర్యాగమును పొంది సమస్త మోహబంధములను వదలి హరిద్వారమునకు వెళ్ళెను. అచట యోగమార్గమును ఆశ్రయించి చిత్తమును ఏకాగ్రము చేసి మనస్సును ఆత్మయందు నిలిపి ప్రకృతిని అతిక్రమించి భగవత్స్వరూపమున స్థిరీభూతుడయ్యెను.

అంతట ఆతనికి విష్ణుదూతల దర్శనమాయెను. హరిద్వారములోని గంగయందు తన దేహమును త్యజించి శ్రీహరి దూతలతో బంగారు విమానములో వైకుంఠమును చేరెను.

అందువలననే మన పెద్దలు సంతానమునకు దేవతల పేర్లు పెట్టు ఆచారమును పాటించుచూ వచ్చిరి. ఒక రోజులో ఎన్నో కొన్నిసార్లు పిల్లల పేర్లు ఉచ్చరించుచుందుము. ఆ విధముగానైన పుణ్యము సంపాదించుకొను అవకాశము కలుగును కదా అను ఆలోచనతోనే ఆవిధముగా చేసిరి. పెద్దలు

Scanned by CamScanner

అనుభవముతోనే ప్రతి క్రియలో ఉత్తమ లోకములను సంప్రాప్తించు పుణ్య కార్యములను గాని, వాటిని అధిగమించి మోక్షమును పొందు పురుషార్ధ కార్యములు గాని జరుగునట్లు ఉపాయముతో నడచి మనకు ఆదర్శ భూతులైనారు.

అజామిళుడు ఈవిధముగా ఉత్తమ గతిని పొందెను. అటు విష్ణుదూతలచే పరాభవింపబడినవారై తమ ప్రభువు ఆనతిచ్చిన కార్యమును నెరవేర్చలేని యమదూతలు ఖిన్నులై యముని కడకు వెళ్ళిరి.

సంయమినీ పురమున విరాజిల్లు తమ ప్రభువైన యమధర్మరాజుతో మొరపెట్టుకొన్నారు.

ఓ ప్రభూ! జీవులు చేయు పుణ్య, పాప, పుణ్యపాపమిశ్రమ కర్మలను మూడు విధములైన కర్మలకు ఫలమునిచ్చు ప్రభువువు నీవు వొక్కడవేనని మేము విశ్వసించియుంటిమి. కర్మలు చేయు జీవులు అనేకులు, కర్మలు అనేకములు కనుక శాసకులు కూడా అనేకులనుట తగదు కదా! ఆవిధమైన పద్ధతియున్న చక్రవర్తి క్రింద వున్న సామంతరాజుల పాలన నామమాత్రమే అన్నట్లగును కదా! కనుక మీరొక్కరే శాసకులని మా నమ్మకము.

మీ శాసనమునకు ఇంతవరకు ఏనాడూ వ్యతిరిక్తముగా జరుగలేదు. కానీ ఈరోజు మేము మీ యాజ్ఞ ప్రకారము అజామిళుడను పాపాత్ముని నరకమునకు తీసికొని వచ్చుచుండగా ఆతడు "నారాయణా!" అనెను. ఆ మాట ఆతని నోటి వెంట రాగానే "భయపడకుము", "భయపడకుము" అంటూ సిద్ధులు నలుగురు అచటికి వచ్చి మా చేతి నుండి ఆతనిని విడిపించిరి. వారెవరు? తెలిసికొనుటకు అర్హులమైనచో మాకు తెలియజేయుడని విన్నవించుకొన్నారు.

తన దూతల మాటలను విన్న యమధర్మరాజు శ్రీహరి పాదపద్మములను స్మరించుచూ వారితో దూతలారా! వస్త్రమునందు దారము ఓతప్రోతమై వున్నట్లు ఈ ప్రపంచమునకు ఆధారమై వున్న వేరొక ప్రభువు గలడు. ముక్కు తాడు వేసిన ఎద్దును వలె ఈ జగత్తునంతటిని తన అధీనములో వుంచుకొనిన విశ్వరూపుడతడు. నేను (యముడు), ఇంద్రుడు, నిర్వతి, వరుణుడు, చంద్రుడు, అగ్ని, శంకరుడు, వాయువు, సూర్యుడు, బ్రహ్మ, ద్వాదశాదిత్యులు, విశ్వేదేవతలు, అష్టవసువులు, సాధ్యులు, మరుత్తులు, సిద్ధులు, ఏకాదశరుద్రులు, రజస్తమోగుణరహితులైన భృగువు మొదలగు ప్రజాపతులు, ముఖ్యులైన దేవతలందరునూ సత్త్వగుణ ప్రధానులైననూ ఆతని మాయకు అధీనులై యుందురు. భగవంతుని యొక్క లీలలను, నామమును సంకర్తీనము చేయుట వలన పాపవిముక్తులగుదురు. అజామిళుడు మిక్కిలి పాపాత్ముడైననూ మరణ సమయమున వివశుడై "నారాయణ" అని అన్నంత మాత్రముననే పాపవిముక్తుడై శుద్ధుడైనాడు. గొప్ప గొప్ప విద్వాంసులైననూ భగవంతుని మాయచే మోహితులై కర్మలయందే మునిగియుందురు అంటూ ఈ సందర్భమున యమధర్మరాజు దూతలకు చేసిన హెచ్చరిక పోతనామాత్యుని పద్యములో వివరించు కొందాము.

సీ ॥ ఎకసక్కెమునకైన నిందిరా రమణుని
బలుకంగలేని దుర్భాషితులను
గలలోననైన శ్రీకాంతుని సత్పాద
కమలముల్ సూడని కర్మదృక్కులను
నవ్వుచునైన గృష్ణ ప్రశంసకు జెవి
దార్చనేరని దుష్కథా ప్రవణుల
యాత్రోత్సవంబులనైన నీశుని గుడి

త్రోవ ద్రొక్కగ లేని దుష్టులను

ఆ॥ పరమ భాగవతుల పొద ధూళి సమస్త
తీర్థసార మనుచు దెలియలేని
వారి వారి వారి వారిజేరిన వారి
దొలుత గట్టి తెండు దూతలార

ఆ॥ ఎల్లపాపములకు నిల్లైన యింటిలో
బద్ధ తృష్ణులగుచు బుద్ధి దలగి
పరమ హంసకులము గుతి తప్పి వర్తించు
ధూర్త జనుల తెండు దూతలార

ఇందిరాదేవి అనగా లక్ష్మీదేవి పతియైన ఆ శ్రీహరి నామమును ఉచ్చరించని వారు ఎంత మంచి మాటలు మాట్లాడిననూ వారు చెడ్డమాటలు మాట్లాడు వారి క్రిందనే జమకట్టబడతారు. కలలోననైన వ్యవహార లంపటలో మునిగి వున్నవారైనందున ఆ ప్రాపంచిక దృశ్యములు తప్ప ఆ శ్రీకాంతుని పాదపద్మములు చూడలేని వారు కర్మబద్ధులు. కృష్ణుడు అటువంటివాడట, ఇటువంటివాడట అంటూ ఆతని చేష్టలను ఆటపట్టించడానికైనా నవ్వుతూ ఎగతాళి చేయవలయునను ఆలోచనతోనైన ఆతని తలపు లేనివారు దుష్కథా శ్రవణులు అనగా చెడు మాటలు విని పాపమును సంపాదించుకొనువారే. మన కాలమానము ప్రకారము 1 సంవత్సరమైతే దేవతలకు ఒకరోజు అవుతుంది. కనుక మనము దేవాలయములలో సంవత్సరమునకు ఒకసారి చేయు తిరుణాల ఉత్సవములు దేవతలకు ప్రతిరోజు ఉత్సవము చేసినట్లగునని పెద్దలు చెప్పుదురు. ఆవిధముగా ఉత్సవములు జరుగునపుడైనా, యాత్రల నిమిత్తముగానైనా ప్రపంచాధినేత, శాసనకర్తయైన పరమేశ్వరుని గుడి

మార్గమున నడువని కుమార్గ ప్రవర్తకులను, పరమ భాగవతుల పాద ధూళియే సమస్త తీర్థముల సారమని తెలియని, దుర్మార్గులను, వారి స్నేహితులను, బంధువులను, వారితో చేరినవారిని ప్రప్రథంగా మీ పాశములతో కట్టి నరక బాధలు అనుభవింప జేయుటకు కట్టి తీసికొనిరండి.

అంతియేగాక ఈ శరీరము పాపములకు నిలయము. ఆ విషయము తెలియక దీనియందలి అనురాగముతో మహాత్ముల మార్గము ననుసరించి తమను తాము ఉద్ధరించుకోలేని మూర్ఖులను శీఘ్రముగా బంధించి తీసికొని రండి అని చెబుతూ ఎవరిని తీసికొని రాకూడదో విశదపరచుచున్నారు.

పద్మనయనుమీది భక్తియోగంబెల్ల
ముక్తియోగమనుచు మొదలెఱుంగు
వారి వారివారి వారిజేరినవారి
తోవ దలపవలదు దూతలార

ఓ దూతలారా! పద్మములవంటి నేత్రములు కలిగిన ఆ భగవంతుని యందు గల అనన్య భక్తియే ముక్తికి మార్గమని బాగుగా తెలిసినవారి, వారివారి, వారితో చేరినవారి వైపు మీరు కన్నెత్తి చూడవలదు. వారు వున్న మార్గమువైపు మీరు ఎన్నడూ వెళ్ళవద్దు అని సుస్పష్టం చేశారు. (సశేషం)

వేదాన్తభేరికి పోషక చందా ఈక్రింది వారు పంపినారు

1. కొండపల్లి ప్రశాన్తి (సికింద్రాబాద్)	-	రూ.1500/-
2. జి.అచ్యుతనారాయణ (పాలంగి)	-	రూ.1540/-
3. గుండేటి రవీందర్ (హుజూరాబాద్)	-	రూ.1500/-
4. డా॥బి.మాధవరావు (విజయనగరం)	-	రూ.1500/-
5. గుఱ్ఱం లావణ్య (ఆమందూరు)	-	రూ.2000/-

Scanned by CamScanner

సంఘ సంస్కరణ దీక్షా దక్షులు

కందుకూరి - మలయాళస్వామి

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

అపరిశుభ్రమైన వాతావరణంలో నివసించరాదు. అట్లే శాంతి, సౌఖ్యం, సౌమనస్యం లేని సమాజంలో గూడా ఉండరాదు. అట్టి వాతావరణంలో గాని, సమాజంలో గాని ఉండవలసి వస్తే ముందు వాతావరణాన్ని పరిశుభ్రం చేయాలి, సమాజాన్ని చక్కదిద్దాలి.

అయితే అందరూ ఆ పనులు చేయలేరు. అందరికీ అందుకు తగిన శక్తియుక్తులుండవు. యుక్తాయుక్త వివేక సంపన్నులు, అపూర్వ మేధా నిధులూ, తపోనిరతులూ అయిన ఏ కొందరో మహనీయులు మాత్రం ఆ పనికి పూనుకొంటారు. అడుగడుగునా ఎదురయ్యే ఆటంకాలను ధైర్య సాహసాలతో ఎదుర్కొంటారు. ఎన్నో క్లేశాలకు గురి అవుతారు. అయినా అచంచల దీక్షతో లక్ష్యం వైపు పయనించి చివరికి విజయం సాధిస్తారు.

అలాంటి మహామహులు తీర్చిదిద్దిన సమాజంలో మాత్రమే.

సర్వేఽత్ర సుఖినస్సన్తు సర్వేసన్తు నిరామయాః ।

సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చిద్దుఃఖమాప్నుయాత్ ॥

అని పూర్వ మహర్షులు కాంక్షించిన, సర్వ విధాలా సుఖశాంతులతో గూడిన జీవితం అందుబాటులోకి వస్తుంది.

ఇంతకూ ఆ మహామహులు ఎవరు? ఎలాంటి వారు? వారి లక్ష్యం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానంగా పేర్కొనదగినవారే శ్రీ కందుకూరి వీరేశలింగం, శ్రీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్, శ్రీ నారాయణ గురు,

శ్రీ మలయాళ స్వామి మున్నగువారు. వారు 'పరోపకారార్థమిదం శరీరం' అన్నట్లు పరోపకారం కొరకే జీవించారు. సర్వతోముఖంగా శాంతి సుఖ సంపన్నమైన సమాజమే వారి లక్ష్యం.

సంఘ సంస్కర్తగా శ్రీకందుకూరి వారు సుప్రసిద్ధులు. చరాచర సుఖాభిలాషి, శుష్క వేదాంతతమోభాస్కరులు అయిన శ్రీ మలయాళ సద్గురుస్వాములవారు ఆంధ్ర – ఆధ్యాత్మిక పితామహులుగా ప్రసిద్ధులైనా వారి చేతలలో ప్రబోధాలలో రచనలలో అడుగడుగునా సంఘ సంస్కరణ ప్రయత్నం స్పష్టంగా కనిపించేది.

పై యిరువురు మహామహుల సంఘ సంస్కరణ కార్యక్రమాలలోని సామ్యాన్ని నిరూపించడానికే ఈ వ్యాసం ఉద్దిష్టమయింది.

స్త్రీ విద్య

స్త్రీలకు విద్యాభ్యాసావకాశాలు లేని దినాలలో వారి సర్వతోముఖమైన అభ్యుదయానికి శ్రీ వీరేశలింగం పంతులు గారు చేసిన కృషి ఎంతో శ్లాఘనీయమైనది. 1874వ సంవత్సరంలోనే వారు ధవళేశ్వరంలో బాలికా పాఠశాల స్థాపించారు. 'సతీహితబోధ' అన్న పత్రిక స్థాపించి తద్వారా స్త్రీ విద్య ఆవశ్యకతను గురించి పలు వ్యాసాలు వ్రాశారు."సత్యవతీ చరిత్ర', 'ఇందుమతీ చరితం" ఇత్యాది రచనలలో స్త్రీలు విద్యావంతులు కావలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు.

శ్రీ మలయాళస్వాములవారు 1913లో తిరుమల గోగర్భతీర్థంలో తపోనిష్ఠ కుపక్రమించారు. 1926 జూన్ వరకూ వారి నిష్ఠ అక్కడ కొనసాగింది. నిష్ఠా ప్రారంభ సమయంలోనే వైరాగ్యం, జ్ఞానం, సమాధి స్థితులతోపాటు సర్వ ప్రాణుల పట్లా సమబుద్ధిని ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించారు. వారి జీవితకాలంలో వారు నిర్వహించిన కార్యాలన్నింటిలో

ఈ సమబుద్ధి ప్రతిబింబితమయింది.

1919లో వారు 'శుష్కవేదాంత తమోభాస్కరము' అనే 450 పుటల గ్రంథం రచించారు.

అందులో లౌకిక విద్యతోపాటు స్త్రీలకు బ్రహ్మ విద్యాధికారము గూడా ఉన్నదని సప్రమాణంగా నిరూపించారు.

"స్త్రీలకు రోగము వచ్చునప్పుడు ఔషధము పుచ్చుకొనుట కధికారమున్న యెడల మహాబాధాకరమగు ఈ అజ్ఞాన వ్యాధిని తొలగించుకొనుటకు జ్ఞానమువలంభింపవచ్చును" అని చెప్పి స్త్రీ విద్యాభ్యాసావశ్యకతను గూర్చి పలు ప్రమాణాలు చూపినారు.

'శుష్క వేదాంత తమోభాస్కర' మన్న గ్రంథం పలు ముద్రణలు పొంది లక్ష ప్రతులకు పైగా వ్యాపించింది. ఆంధ్రావనిలో ఆధ్యాత్మిక విప్లవమును సాధించిన గ్రంథరాజమది.

అల్లే 1954లో ప్రచురింపబడిన 'శ్రీమలయాళయతీంద్ర గీత'లో ఐదవ అధ్యాయానికి' స్త్రీ విద్యాధికార యోగం' అని పేరు పెట్టారు. స్త్రీలకు బ్రహ్మజ్ఞానం కలగడానికై బ్రహ్మవిద్యలో తప్పక ప్రవేశం ఉండాలని ప్రతిపాదించారు. మైత్రేయి సులభ, గార్గి, మదాలస, చూడాల మున్నగు ప్రాచీన మహిళామణులను ప్రస్తావించి వారిలాగానే నేటి మహిళలు గూడా ఉన్నత విద్యకూ, బ్రహ్మవిద్యకూ తగినవారే అని నిశ్చయించి నిరూపణ గావించారు.

శ్రీ మలయాళ యతీంద్ర గీతలోని పంచమాధ్యాయంలో అరువది (60) శ్లోకాలున్నాయి. 1954లో ఇది మొదటిసారి ప్రచురింపబడింది. మరల 2001లో శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి – 20 సంపుటాలలోని చివరి సంపుటంలో ముద్రితమయింది.

కన్యా గురుకుల స్థాపన

సర్వ సమభావ సంపన్నమైన తమ ఆశయాలను మాటలకే పరిమితం చేయక శ్రీస్వాములవారు 1954లో వ్యాసాశ్రమంలో ఒక కన్యా గురుకులం స్థాపించి అందులో వేలకొలది బాలికలు ఇతర పాఠ్యాంశాలతోబాటు సంస్కృతం గూడా నేర్చుకొనే సదవకాశం కల్గించారు. ఆశ్రమ పాఠశాలలో సంస్కృతం చదివి 'ఎంట్రన్స్' పరీక్షలో ఉత్తీర్ణత పొందిన మహిళలు తిరుపతి వంటి నగరాలలో సంస్కృతంలో ఉన్నత విద్యనభ్యసించడానికి సనాతనుల నుండి నిరోధాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. కాని కాలక్రమంలో ఈ ఆటంకాలన్నీ క్రమంగా తొలగిపోయి శ్రీస్వామివారి సదాశయాలు ఫలప్రదాలయ్యాయి.

శ్రీస్వామి వారి శిష్యులు గూడా ప్రొద్దుటూరు, చిత్తూరు, శ్రీకాళహస్తి మున్నగు ప్రదేశాలలో బాలురతోపాటు బాలికలు గూడా సంస్కృత విద్యనభ్యసించడాని కనువుగా పాఠశాలలను, కళాశాలలను స్థాపించారు.

'పండితాః సమదర్శినః' – అన్న గీతోక్తిననుసరించి సమదర్శనం కల్గి లోకోద్ధారకమైన అనేక నిర్మాణాత్మక కార్యక్రమాలు, గ్రంథరచనలు, ఆత్మప్రబోధాలు, ఆశ్రమ స్థాపనలు, ప్రాచీన గ్రంథ పునర్ముద్రణలు, జ్ఞానయజ్ఞాలు, గీతోపనిషత్ప్రచారాలు మున్నగు లోకసేవారూపమైన పనులను నిర్వహించినవారు కావడం వల్లనే శ్రీస్వాములవారిని అపరశంకరులు, ఆధునిక వ్యాసులుగా కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారు సన్నుతించారు. శ్రీ శివానందసరస్వతీ స్వాములవారు వారి జీవితమే భగవద్గీతకు భాష్యమని కీర్తించారు. – (సశేషం)

గృహవైద్యం

రాత్రి పండుకొనేటప్పుడు 100 మి.లీ. గోరు వెచ్చని పాలలో ఒక గ్రాము దాల్చిన చెక్క చూర్ణాన్ని కలిపి త్రాగితే సుఖంగా మంచి నిద్ర వస్తుంది.

ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

" దివ్యజీవన సంఘము"నకు చెందిన " యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ " 94వ యోగవేదాంత తరగతులను 01-03-2020 నుండి 29-04-2020వ తేదీ వరకు రెండు మాసముల కొరకు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సు గల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్ల భాషయందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసియుండవలయును. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేది 15-01-2020. ఈక్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. మఱియు www. Sivanandaonline.org.website నుండి కూడా పొందవచ్చును. e-mail : Yoga@dlshg org.

Address
The Registrar,
The Yoga Vedanto,
Forest Academy,
The Divine Life Society,
Sivnandanagar - 249192\
Tehri Garhwal District (Uttarakhand)

ఇట్లు
Swami yogavedantanand
The Registrar, Yoga
Vedanta Forest Academy,

దత్తాత్రేయుని ఆవిర్భావం

- రచన : డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్

శ్లో ॥ దత్తం పునర్దత్తం యోవదేత్ భక్తి సంయుతః
తస్య పాపాని సర్వాణి క్షయం యాంతి నసంశయః ॥

అని పండితుల అభిభాషణం. "దత్తం" అనే నామాక్షరాల్ని, ముమ్మారు భక్తితో పల్కిన మానవుని పాపాలు సర్వమూ నశిస్తాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదని విశ్వాసం. పరమాత్మ అవతారాలను ఏకవిశంతి (21 అవతారాలని) అని, దశావతారాలని (10 అవతారాలని) విభిన్నంగా మనం భావిస్తాం. నిజానికి పరమాత్మ అవతారాలు అసంఖ్యాకం. ప్రతి అవతారం యొక్క పరమార్థం లోక కల్యాణం. ప్రకృతిహితం, జీవుల శ్రేయస్సు. భాగవతంలో వివరించిన అవతారాలలో దత్తాత్రేయుని అవతారం కూడా ఒక్కటి. అయితే ధర్మరక్షణ, శిష్టసంరక్షణ, దుష్ట శిక్షణలతో ఆయా అవతారాల లక్ష్యాలు ముగిసినట్లు భావిస్తాం. ఇందుకు భిన్నమైంది దత్తాత్రేయుని అవతారం. ఈ అవతారం పరంపరగా సాగుతోందని విజ్ఞుల విశ్వాసం. శ్రీపాద వల్లభుడు, మాణిక్య ప్రభువు, నృసింహసరస్వతి ఇలా ఎందరో మరెందరో అవదూతల ద్వారా అవతార ధర్మాలు నెరవేర్చబడుతుండడం విశేషం. జ్ఞానానంద మయుడు, సర్వ విద్యలకు ఆధారమైనవాడు, మహాయోగి, సుజ్ఞానభోగి, తత్త్వరహస్య బోధకుడు, నిత్య పరతత్త్వ జ్ఞాన ప్రవక్తకుడు, త్రిమూర్త్యాత్మకుడునైన దత్తాత్రేయస్వామి మహాగురుదేవునిగా జ్ఞానులకు పరిచయం కావడం విశేషం. శరీరాలు మారినా ఆత్మ పరతత్త్వ నీతి, రీతి, నియతి, విభూతి ఒక్కటే. మనిషిలోమానవీయతను నింపాలి. మనీషిగా ఎదిగేటట్లు ప్రోత్సహించాలి. సాధకునిగా, యోగిగా మార్చాలి. సమాజ నవజీవన

వికాసానికి, బ్రతుకు వేదాన్ని వివరించాలి. మాయ పొరలు తొలగించాలి. అప్పుడే మానవుడు అజ్ఞాన మరీచికలను వదలి, సుజ్ఞాన వీచికలను దర్శిస్తాడు. అందుకు దత్తగురువు ఆవిర్భావ వికాసం, వైభవాన్ని మనం కొంత తెల్సుకోవాలి.

మాధవతత్త్వం నిండుగా పరివ్యాప్తమై యుండే పావనకాలం మార్గశిరమాసం. "మాసాలలో మార్గశీర్షమాసం నేనే" అన్నాడు గీతలో శ్రీకృష్ణ పరమాత్మ. అలాంటి మార్గశిరంలో పున్నమినాడు దత్తాత్రేయులు జన్మించారని పురాణ వచనం. వీరి పుట్టుకకు కారణాలు, సందర్భం కూడ విశేషాలతో నిండి సత్య సందేశాత్మకం కావడం ముదావహం.

పూర్వం కౌశికుడనే బ్రాహ్మణుడుండేవారు. అతడు కుష్ఠురోగి. అతని భార్య సుమతి. పేరుకు తగిన పతివ్రతాశిరోమణి. పతిభక్తి పరాయణురాలు. ఒకమారు తన భర్త కార్యం కోసం, అతణ్ణి వెంట బెట్టుకొని వెళ్తుండగా, రాత్రివేళ తన భర్త కాలు మార్గమధ్యంలో కొఱత వేయబడియు, మరణించక యున్న మాండవ్యుడను మునికి తగిలింది. అందుకు బాధాతప్తుడైన మాండవ్యుడు "రేపు సూర్యోదయం లోపు నన్ను కాలితో తన్నినవాడు మరణించు గాక" అని శపిస్తాడు. అంత సుమతియు తన పాతివ్రత్య మహిమతో "సూర్యోదయం కాకుండుగాక అని శాపానికి ప్రతిగా శాసిస్తుంది. తిరిగి భర్తతో యింటికి చేరుతుంది. సూర్యోదయం ఆగిపోయింది. కాలం ఆగిపోయింది. లోకాలు తల్లడిల్లుతున్నాయి. దేవతలు బ్రహ్మగారి దగ్గరకు వెళ్ళారు. బ్రహ్మగారు బాగా ఆలోచించి, ఈ ఉపద్రవం నుండి కాపాడగల్గింది అత్రి మహర్షి భార్య అనసూయయని గ్రహించి, ఆ తల్లిని విశ్వశ్రేయస్సునకై ప్రార్థిస్తారు. అప్పుడు అనసూయ సుమతి దగ్గరకు వెళ్ళి సానునయంగా మాట్లాడి, ఆమె తన శాసనాన్ని ఉపసంహరించు కొనేటట్లు చేస్తుంది.

సూర్యోదయమైంది. మాండవ్యుని శాపంతో సుమతి భర్త మరణించాడు. కాని అనసూయ తన పతివ్రతా ధర్మంతో తిరిగి సుమతి భర్తను బ్రతికిస్తుంది. సుమతీ కౌశికుల కథ సుఖాంతమైంది.

అయితే మనకు కావలసిన అసలు కథ ఇప్పుడు ప్రారంభ మవుతోంది. అనసూయ చేసిన లోకోపకారానికి త్రిమూర్తులు "తల్లీ! నీ లోకోపకారం మహాశ్లాఘనీయం. ఏదైనా వరం కోరుకో" అంటారు. అప్పుడా తల్లి "మీ ముగ్గురూ మాకు పుత్రులుగా జన్మించాలి" అంటుంది. అనసూయ భర్త అత్రి మహర్షియుపాంజులుడై అదే వరాన్ని కోరతాడు. వారు "తథాస్తు" అన్నారు.

అత్రి అనసూయలకు బ్రహ్మ అంశతో చంద్రుడు, రుద్రుని అంశతో దుర్వాసుడు, విష్ణువు అంశంతో దత్తాత్రేయుడును జన్మించారు. కొంతకాలం తరువాత బ్రహ్మరుద్రులు తమ అంశలను కూడా దత్తునకు అర్పించి తిరిగి వెళ్ళిపోయారు. ఆవిధంగా దత్తాత్రేయులవారు త్రిమూర్త్యాత్మకుడైనాడు.

అత్రి, అనసూయలు సామాన్యులు కారు. సమ్మాన్యులు. పూజనీయులు, నిత్యకీర్తనీయులు. అత్రి = అనగా మూడు కానివాడు అత్రి. గుణత్రయానికి, తాపత్రయానికి, గ్రంథిత్రయానికి అతీతుడైన మహాయోగి, తపోధనుడే అత్రి మహర్షి. ఆత్మజ్ఞానంతో పరమాత్మ తత్త్వదర్శన అనుభూతి యోగంతో, ధ్యానంతో కాలాన్ని కరిగించే శక్తి ఆయన. ఇక అసూయలేనిది, ఎఱుగనిది అనసూయ. ఈర్ష్య, అసూయ, ద్వేషాలు త్యజిస్తే ప్రేమ, ఆనందాలే మిగులుతాయి. భర్తసేవలో, పతివ్రతాధర్మంలో పరమాత్మ తత్త్వాన్ని గ్రహించిన తల్లి అనసూయ. పతిభక్తి, పరమాత్మ అనురక్తి, సహజీవుల శ్రేయోభిలాషియైన ఆ తల్లికి అనుకోని శక్తులు, మహిమలు సొంతమైనాయి. మంచి మనస్సు, ప్రియవచస్సు, మహిత తపస్సులు గలవారికి అంతా ఆనందమే. జ్ఞానులు

Scanned by CamScanner

కష్టాలు, నష్టాలు, వేదనలు, రోదనలలో కూడా ఆనందాన్నే వెదకుతారు. ఆ ఆనందమే పరమాత్మ విభూతి.

"దత్తోమయా ఉ హమితి యద్భగవాన్ సదత్తః" తనను తాను బిడ్డగా అత్రి, అనసూయలకు ఇచ్చుకొన్నవాడు గనుక స్వామిదత్తుడు. అత్రిమహర్షి కుమారుడు ఆత్రేయుడు. కనుక మొత్తంగా స్వామి దత్తాత్రేయుడైనాడు.

ఒకమారు త్రిమూర్తులు అనసూయ మంచితనం, పతిసేవా పరాయణత్వం, పాతివ్రత్య మహిమ, వైభవాలను ముగ్గురమ్మలకు చెప్పి కీర్తించారట. పరమాత్మ మాయతో ముగ్గురమ్మలకును ఈర్ష్య అసూయలు కల్గాయి. అందుకు అమ్మలు అయ్యవారలకు ఒక పథక రచన చేసి త్రిమూర్తులను అత్రి ఆశ్రమానికి పంపారు. త్రిమూర్తులును తమ ఆకృతులను సన్యాసులుగా సంతరించుకొని ఆశ్రమానికి విచ్చేశారు. అత్రిముని ఆశ్రమంలో లేడు. అనసూయ మహాసాధ్వి ఆశ్రమ పూజా కార్యక్రమాలలో ఉంది. ఇదే తగిన సమయంగా భావించిన త్రిమూర్తులు "మాతా భిక్షాందేహి" అన్నారు. "అమ్మా! భిక్షను ఇవ్వు" అన్న మాటలు ఆ తల్లికి ఎంతో రుచించాయి. అలాగే రండిస్వామి, ఆసీనులు కండు" అంది. తాను భోజన సంబారాలను సర్దుకొంటుండగా మరలా మగ్గురయ్యలు" అమ్మా! మాకు ఒక నియమం ఉంది. వడ్డించే తల్లి నగ్నంగానే భోజనాన్ని ఇవ్వాలి" అన్నారు. అనసూయ నివ్వెరపోయింది. మరుక్షణంలో ఆ తల్లి మేధామథనం జరిగింది. జ్ఞాన నవనీతం ఆ తల్లి బుద్ధిని తాకింది. "అమ్మా" అన్నవారు బిడ్డలే కదా! కనుక నేను తల్లిని. మాతృత్వానికి హద్దులేముంటాయి. మనసును స్థిరపరచుకొంది. 'పతి దేవాయ నమః" అంటూ భర్తకు నమస్కరించుకొంది. ఆమె జ్ఞాన నేత్రం విచ్చుకొంది. త్రిమూర్తుల గట్టురట్టయింది. వెంటనే పతి కమండల జలాన్ని అభిమంత్రించి, సన్యాసి రూపంలో ఉన్న ముగ్గురిపై చల్లింది. అంతే

ఆ తల్లి పాతివ్రత్య మహిమా ప్రభావంతో ఆ ముగ్గురూ పసివారైనారు. అప్పుడు అనసూయ ఊయలవేసి, మాతృత్వపు పొంగుతో పెల్లుబికిన స్తన్యాన్ని ముగ్గురు పసివారికి కడుపార తాపించి, ఊయలలో పరుండబెట్టి, లాలిపాటలతో నిద్రింప చేసింది. ఇలా ప్రతిరోజూ వారిని ఆ తల్లి బిడ్డలుగా పెంచుతోంది. ఇంతలో అత్రిముని వచ్చాడు. దివ్యదృష్టితో అంతా తెల్సుకొన్నాడు. త్రిమూర్తులను బిడ్డలుగా పెంచగల్గిన అదృష్టానికి పొంగి పోయాడు. అనసూయమ్మ సుకృతం కదా! యిది.

కాలం గడుస్తోంది. పిల్లలు పెద్దవారవుతున్నారు. పై లోకాలలో ముగ్గురమ్మలకు ఆందోళన మొదలైంది. అయ్యల మాయలో వారున్నారు. నారదుని సాయంతో అత్రి ఆశ్రమంలో పసివారై ఊయలలూగుతున్న తమ నాథులను కని విభ్రాంతులైనారు. "ప్రేమను పంచేది తల్లి. మమకారాన్ని పెంచేది తల్లి. అసూయను, ద్వేషాన్ని త్రుంచేది తల్లి. మనుగడకు అర్థం పరమార్థం తెల్పే తొలి గురువు తల్లి. స్వార్థం ఎఱుగనిది తల్లి. పరార్థమే, పరహితార్థమే పరమ ధర్మంగా, పతిభక్తి, పతిసేవా పరాయణత్వమే ధర్మమర్మంగా భావించేది అనసూయమాత. అందుకే ఆ తల్లికి ఆ వైభవం, అందుకే ఆ తల్లికి మహిమా ప్రాభవం. ముగ్గురమ్మలు గుర్తించారు. మాయ తొలగింది. మనసులు నిర్మలములైనాయి. అనసూయకు శ్రీలక్ష్మీ సరస్వతీ పార్వతమ్మలు అంజలి ఘటించారు. అంతే పసివారి నుండి ముగ్గురయ్యలు బయటకు వచ్చారు. వారిలో బ్రహ్మ, రుద్రుడు తమ అంశలను మూడవ బాలునిలో నిక్షిప్తం చేసి వెళ్ళారు. విష్ణువును ముగ్గురు బిడ్డలను ఆ ముని దంపతుల కప్పగిస్తూ, మూడవ పసివానిలో తన అంశనూ నిక్షిప్తం చేశాడు. త్రిమూర్తుల అంశలతో అలరిన దివ్యుడే దత్తాత్రేయుడు. మొదటి యిద్దరూ చంద్రుడు, దుర్వాసుడును అయినారు.

మూడు శక్తులకు కనువిప్పు, లోకాలకు సత్య సందేశం దత్తాత్రేయ

ప్రభువు జననం. ఈశ్వరుని దక్షిణామూర్తి రూపం జ్ఞానరూపం. మౌనంతోనే శిష్యుల సందేహాలను తీర్చిన మహాగురువు రూపం. అలాంటిదే దత్తాత్రేయుని రూపం.

చిన్నతనం నుండి యోగం, తపం, జపం, ధ్యానంతోనే కాలం కరగిస్తూ ఆత్మానందానుభూతిని పొందడం దత్తగురువునకు అలవాటు. ఎక్కువగా ఏకాంతంగా ఉండేవారు స్వామి. అయితే బాలకులు విభిన్నరకాలుగా విసిగిస్తుంటే, స్వామి కూడా వారిని తప్పించుకోవడానికి విభిన్నమైన రీతులలో మద్యం త్రాగుతూ, స్త్రీలతో కూడి కన్పించేవాడు. నాల్గు కుక్కలు, 8 సురాభాండాలు, 16 మాంసపు ముక్కలు, 32 మంది యువతులు, 64 మంది జూదరులు, 128 మంది ప్రలోభాల మధ్య ఉన్నట్లు కన్పించేవాడు. నిజానికి అజ్ఞానులకు కన్పించే స్వామి స్వరూప సందర్భమిది. సుజ్ఞానులకు మాత్రం నాల్గు వేదాలు, అష్టసిద్ధులు, షోడశ విద్యలు, 32 బ్రహ్మ విద్యలు, 63 కళలు, 128 తత్త్వాలతో అలరారే దివ్య మంగళ స్వరూప సన్నివేశం స్వామిది.

ధర్మగ్లానితో, సనాతన సంస్కృతీ క్షయంతో అల్లాడుతున్న, భూలోక జీవులకు సుగతులను అందించడానికి వచ్చిన గురుపరమాత్మ దత్తస్వామి. అరాచకం, అధర్మం పెచ్చరిల్లినప్పుడు రాక్షసబలం పెరుగుతుంది. అలాంటి రాక్షసతత్త్వాలను నిర్మూలించడానికే స్వామి భూలోకానికి దత్తగురువుగా వచ్చారు. ఆయనకు అనఘుడు అని పేరు. పాపరహితుడు. పాపసంహారి. పుణ్యవంతుడు. ఆయన వామభాగంలో అనఘాదేవిగా శ్రీమహాలక్ష్మీదేవి అలరారడం విశేషం. జంభాసురాది రాక్షస గణాలను దేవేంద్రాది దివిజుల కోరికపై బలహీనపరచి, వారిని దివిజులు జయించేటట్లు చేసిన పావనమూర్తి స్వామి.

దత్తగురువునకు గురువులు ప్రకృతి జీవులట. భూమి నుండి ఓర్పు, వాయువు నుండి నిస్సంగత్వం, నీటి నుండి జీవనాధారం ఇలా చీమ నుండి చతుర్ముఖ బ్రహ్మ వరకు ప్రతిజీవి, వస్తువుల నుండి స్వామి నేర్చుకొన్నాడు. నేర్చిన జ్ఞానాన్ని మనకందించాడు. నిరంతర శోధన, సాధన బోధనలతోనే కాలాన్ని కరగించారు. దత్తాత్రేయుని వైష్ణవాంశపు దివ్యతేజాన్ని గుర్తించిన కార్తవీర్యుడు నిరంతరం స్వామిని కొలిచాడు. ఫలితంగా శక్తి యుడిగిపోయిన తాను మహాశక్తివంతమైన సహస్ర బాహువులను పొందాడు. అలర్కుడు, ప్రహ్లాదుడు మొదలయిన భాగవతోత్తములకు బ్రహ్మ విద్యను అందించిన గురువు దత్తాత్రేయులవారే.

మార్గశిరమాసంలో బహుళ అష్టమి నాడు అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహిస్తారు. వయోలింగ భేదం లేకుండా ఎవరైనా ఈ వ్రతం చేయవచ్చు. అనఘుడు దత్తాత్రేయులు. అనఘాదేవియే శ్రీమహాలక్ష్మి. వీరికి అష్టసిద్ధులు పుత్రులై అవతరించారని, పీఠంపై ప్రతిష్ఠ చేసి వ్రతమాచరిస్తారు. పనస చెట్టు పాదులో ఈ వ్రత నిర్వహణ శ్రేష్ఠం అంటారు.

"అచ్యుత నామ సంకీర్తనాత్ ప్రణాశమేతు త్రివిధం" పరమాత్మ నామ సంకీర్తనతోనే మూడు విధాలయిన పాపాలు అనగా కాయిక; మానసిక, వాచిక పాపాలు నశిస్తాయని ప్రతీతి. దైవమే గురువై, సుజ్ఞాన మార్గాలను చూపిన అవతారం దత్తాత్రేయ అవతారం. సత్యాన్ని, నిత్యాన్ని, తత్త్వాన్ని, యోగాన్ని, జ్ఞానాన్ని, సుజ్ఞాన భోగాన్ని ప్రవచించిన పరమాత్మ ప్రబోధాలను పంచుదాం, పెంచుదాం, ఆచరిద్దాం, ఆచరింపచేద్దాం. దత్త జయంతి ద్వారా మనం మనల్ని పరమాత్మకు అర్పించుకొందాం. అందుకు అహంకారాన్ని నులిమేద్దాం, స్వచ్ఛమైన హృదయ ద్వారకవాటాలను తెరుద్దాం. అందు అనఘుడైన దత్తగురువుని ప్రతిష్ఠించుకొందాం. సుజ్ఞాన సుభోదయానికి, విజ్ఞాన నవోదయానికి ఆయత్తమై యుందాం.

మూలం: **ఉద్ధవ గీత** అనువాదం:

శ్రీ వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

(గత సంచిక తరువాయి)

* ఈ దేహ- ఇంద్రియ- విషయ జగత్తు ఎదురుగా ఆయా ఆహార - విహారాది సందర్భములలో అనివార్యంగా అగుపిస్తున్నటికీ ... ఇదంతా స్వప్న సదృశమే! ఆత్మయే ఇదంతా! పరమాత్మయే ఇట్లా అగుపిస్తోంది... అనే మననమును సర్వకాల -సర్వావస్థలలోను అభ్యసించండి! వస్తు దృష్టిని వదలుతూ, ఆత్మీదృష్టిని పెంపొందించుకోండి!. దేహం ఉన్నంత వరకే ఇక్కడి సంబంధాలు! దేహికి దేహమే భ్రమ! ఇక ఇవన్నీ భ్రమకాక మరేమిటి? ఇది దృష్టిలో ఉంచుకొని మరల మరల ధ్యానం చేయండి! సర్వ స్మృతులను (జ్ఞాపకాలను) ఆత్మగా దర్శించే సాధనలోలయింపజేయండి. అప్పుడు మోహము దానంతట అదే తొలగిపోతుంది!

ఓ సనక- సనందనాదులారా! దేహం ఉన్నంత వరకు సంబంధములు-అనుబంధములు-బాంధవ్యములు. ఇత్యాది రూపములతో కూడిన వర్తమాన దృశ్య సంబంధం కొనసాగుతూనే వుంటుంది. దేహ సంబంధమైనవి దేహంతోనే పోతాయి. కాని సంస్కారములో? తదనంతర దేహముల రాక-పోకలకు కారణమగుచు ఉన్నది! అనగా, మరల ఆ సంసారము క్రొత్త క్రొత్త పిందెలతో కొనసాగుతోంది. అయితే ... దేహము ఈ దేహికి ఐహికమోహము లేక ఐహిక భ్రాంతి! ఏ ఆత్మసత్యమును సిద్ధింపజేసుకోవాలని ప్రయత్నించుచున్నారో.. అట్టి సిద్ధయోగాభ్యాసకులు "ఈ దేహము నశ్వరము. నాశన శీలము. కనుక వర్తమాన సంబంధ బాంధవ్యములు నశించబోవుచున్నాయి!" అని మునుముందుగానే గమనిస్తున్నారు. దానిని సాధన వస్తువుగా మాత్రమే చూస్తున్నారు.

మమకార-అహంకారాదులతో కాదు!

అజ్ఞానియో..? దైవవశాత్ వచ్చిపోతున్న ఈ దేహము, ఈ సహజీవుల సంబంధమైన మమకారములు, అనుబంధ బాంధవ్యములు, ఈ దేహముతో పెంపొందించుకున్న అవినాభావతాదాప్యము.. ఇవన్నీ చూసుకొని మురిసిపోతున్నాడు! ఆహా! ఇవన్నీ ఎంత సత్యం! ఎంత ప్రియమైనవి! ఇవన్నీ కదా, నాకు సుఖం కలిగించేవి! అయ్యబాబోయ్! వీరితో ఈ సంబంధం దూరం అయిందా,.. ఇక నా పని ఖాళీయే కదా! వీరిని చూడకుండా ఉండలేను! వారంటే నాకు అయిష్టం! ఎట్లా వదులుతారో, ఏమో?.. ఇత్యాది భ్రమలన్నీ పొందుతూ జీవితము అనే గొప్ప అవకాశమును బూడిద చేసుకుంటున్నాడు. దృష్టిని దృశ్య పరిమితం (What is being seen with physical eyes) చేసిన వానికి- ఇది నిజమా? నిత్యమా? శాశ్వతమైన సుఖం ప్రసాదించేదా? ఈ దేహాలు ఎందుకు వస్తున్నాయి? దీనిని ఏ దృష్టితో చూస్తే జీవితావకాశం సద్వినియోగం అవుతుంది? - ఇటువంటి మార్గములలో పరిశీలించబుద్ధియే కావటం లేదు!

సిద్ధయోగియో....? మత్తుపానీయం సేవించినవానికి తన ఒంటికి వస్త్రాలు ఉన్నాయో -లేవో కూడా తెలియకుండా తిరుగుతూ ఉంటాడు చూశారా? అట్లాగే... సిద్ధపురుషుడు ఈ దేహం ఉన్నదా? ఊడిందా?.. అనే పరిమిత భౌతికానుభూతిని అధిగమిస్తున్నాడు! నశ్వరమగు ఈ దేహం ఉన్నపుడు - లేనప్పుడు కూడా నిశ్చలంగా నిశ్చింతుడై వుంటాడు! దైవవశంగా ఈ శరీరం వచ్చినప్పుడు, మరొకప్పుడు తొలగుచున్నప్పుడు, జీవిస్తూ వున్నపుడు కూడా, తన దృష్టిని ఇంద్రియ విషయములవైపు సారించదు. సహజీవులకు ఇంద్రియ విషయములుగా కాకుండా సహజాత్మ స్వరూపులుగా సందర్శిస్తూ ఆత్మావలోకనం చేస్తూ వుంటాడు. ఎట్టి సందర్భములలోను, స్థితి-గతులలోను ఆత్మావలోకనము నుండి చ్యుతి పొందదు!. (బ్రహ్మావలోకధిషణం న జహాతి యోగీ) ఇక ఈ దేహము యొక్క గతి గురించి ఏమిటంటారా?

Scanned by CamScanner

ఈ దేహం కర్మానుసారంగా దైవవశాత్ ప్రాణములతో కూడి జీవిస్తూ వుంటుంది! ఈ ఇంద్రియములు ప్రవర్తిస్తూ వుంటాయి! "సర్వసమ దర్శనము (లేక) ఆత్మోపమ్యేవ సర్వత్రా సమం పస్యతి- అనురూపంగా నాకు నేనే నన్ను నేనే ఈ సర్వరూపాలుగా భావన చేసుకొని ఆస్వాదిస్తున్నాను"- ఇటువంటి అనుభూతిని నిశ్చలం చేసుకొన్న తరువాతనో? ఆతడు తత్త్వజ్ఞుడు అని చెప్పబడుచున్నాడు. సిద్ధసమాధియోగి అని పిలువబడుచున్నాడు!

ఓ ప్రియ బిడ్డలారా! పరమార్ధతత్త్వజ్ఞులు అవండి! సమాధి యోగులుగా మిమ్ములను మీరు తీర్చిదిద్దుకోండి! ఈ భౌతిక దేహంతో ఆసక్తి విడచినవారై ఉండండి!. "నేను - నాకు కనబడేవారు.. అంతాకూడా **అఖండమగు ఆత్మయొక్క చమత్కార ప్రదర్శనమే! ఆత్మ సర్వదా, యథాతథం! అనేకత్వం ఎక్కడా లేదు! ఏకము- నిత్యము అగు ఆత్మయే నేను -నీవు కూడా!"** అను దృష్టిని సిద్ధించుకున్నవారై... ఆపై ఇక యథేచ్ఛగా మీ ఇచ్ఛ వచ్చినచోట సంచరించండి!

సిద్ధయోగి సర్వత్ర ఆత్మనే దర్శిస్తున్నాడు! ఇక ఆపై స్వప్న తుల్యమగు ఈ దేహ ఇంద్రియ విషయ పరంపరలను స్వప్న దృశ్యంగా దర్శిస్తున్నాడు!. అనగా.. భౌతిక దేహము-విషయముల పట్ల అనాసక్తి (ఆసక్తిరహితుడై) ఉంటున్నాడు!. (లేక) తాను చదువుచున్న కథలో కల్పించబడిన పాత్రలవలె సందర్శిస్తున్నాడు. ఓ విప్రవర్యులారా! హంసరూపుడనై ఇప్పుడు మీకు సాంఖ్య యోగ రహస్యాన్ని దేహమును -దృశ్యమును దర్శించవలసిన విధానాన్ని, దర్శించకూడని విధానాన్ని వివరించాను!.

సనకాదులు: ఓ హంస మహాశయా! పరమహంసా? ఎవరు మీరు? దేహతదాత్మ్యముతో కూడిన చిత్త విభ్రమముల మధ్య చిక్కియున్న మాకు సిద్ధపురుషయోగాన్ని ప్రబోధించిన మీరు మా యందు దయతో పరమసత్యాన్ని బోధించి నిద్రలేపారు! ఆత్మసాక్షాత్కారం అభ్యసింపజేసినట్టి తమరెవ్వరు?

హంస: నాయనలారా! నేను స్వయంగా విష్ణు భగవానుడను! మీకు సాంఖ్యయోగ రహస్యం వివరించటానికి మీ ముందు ఈ హంసరూపంగా ప్రత్యక్షం అయ్యాను! నా స్వరూపం సాఖ్యం-యోగం-సత్యం-ఋతము (ఆప్తవాక్యాలు) తేజస్సు- శ్రీ- కీర్తి-దమము... ఇత్యాదులన్నింటికీ సమా శ్రయమగు సర్వముగా ప్రదర్శితమగుచున్న విష్ణుతత్త్వమే! సర్వ జీవరాసుల లోను సర్వదా స్వస్వరూపంగా ప్రత్యక్షమై యున్న విష్ణుత్వమే నా వాస్తవరూపం!.

నిత్యుడను! నిత్య సత్యమును! అప్రాకృతుడను! నిర్గుణుడను! నిరాకారుడను! సంగరహితుడను! అపేక్షారహితుడను! సర్వ జీవులకు హితుడను! దయా మయుడను! సర్వుల స్వస్వరూపుడనై వుండటం చేత, సర్వ ప్రేమాస్పదుడను! అందరిచే ప్రేమించబడుచున్నది నేనే! సర్వులు నా ప్రేమాస్పద స్వరూపాలే! సర్వాంతర్యామిని! నిర్గుణుడగు నన్ను సర్వగుణములు సేవిస్తూ వున్నాయి! నేను మీ యొక్క స్వస్వరూరుడనే సుమా!

ఓ మిత్రమా! ఉద్ధవా! ఆ విధంగా నా సిద్ధపురుషవాక్యములు విన్న తరువాత సనకుడు మొదలైన మునులంతా సంశయ నివృత్తులు అయ్యారు! ప్రేమాస్పదంగా నన్ను పూజించారు! దివ్యస్తోత్రములతో... భావమును నీవయ్యా.., రాగమును నీవయ్యా..., యోగమును నీవయ్యా..., సకలమును నీవే ! నేనే నీవు! మేమే నీవు! నీవే మేము! నీ యొక్క అంశయే మేము!

మేము మీకు అద్వితీయులం! ఇక్కడ, ఈ దృశ్యములోని దేహ-బుద్ధి-చిత్త-అహంకారాలు ఆత్మను సేవించటానికై ఆత్మచే కల్పించబడి-కదలింపబడుచున్నాయి! మేము ఆత్మ స్వరూపులం

త్వమేవాఽహమ్ త్వమేవాఽహమ్!..., అని గానం చేశారు! తమ ఆత్మేశ్వరుడనగు నన్ను కీర్తించారు! అప్పుడు నేను అలవోకగా చిరునవ్వు చిందిస్తూ అక్కడి వారంతా చూస్తూ వుండగా... వాయుతరంగం వాయువులో ఐక్యం అయినట్లు- జలతరంగం జలంతో ఐక్యత పొందినట్లు- ఆ హంస రూపం ఉపశమింపజేసి నిజధామమునకు వెడలాను!.

Scanned by CamScanner

వైరాగ్యమనగా!

- కె. ఈశ్వర్

వైరాగ్యమనగా కుటుంబ బాధ్యతల నుండి తప్పుకొని సోమరితనము పెంచుకొని పలాయనం చిత్తగించుట కాదు.

శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం అను మూడు రకాల వైరాగ్యాలు వాడుకలలో వాడుకుంటుంటారు. అనగనగా ఒక ముసలమ్మ ఒకానొక ఆశ్రమానికి పరుగుతీసింది. ఆశ్రమంలో స్వామివారిని కలిసింది. స్వామీ! ఆశ్రమంలోనే వుండాలని వచ్చాను. దయచేసి చేర్చుకొనండి అన్నది. అందులకు ఆ స్వామి అసలు నీవు ఇల్లు వదలి ఎందుకు వచ్చావు? అని అడిగారు. **ముసలమ్మ జవాబు:** స్వామీ మా మనుమడు వున్నాడు, వాడికి నాకు పేచీ వచ్చింది. ఆస్తిలో కాదు నాకు ఈ టి.వి. అంటే ఇష్టము, నేను ఈ టి.వి చూస్తుంటే వాడు టి.వి.9కు మారుస్తాడు. నాకు కోపం వచ్చింది. పరుగెత్తుకొని మీ వద్దకు వచ్చాను. ఇక ఇంటి గడప తొక్కను. ఇక్కడే వుంటాను. ఇట్టి వైరాగ్యానికి ఏమని పేరు పెట్టాలో ఆలోచించండి. మరో వైరాగ్యాన్ని గురించి తెలుసుకొనండి. ఒకానొక వ్యక్తి మా ఆశ్రమానికి పరుగు పరుగున వచ్చి సద్గురు దేవులైన పూజ్యపాదులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారితో స్వామీ నాకు అర్జంటుగా సన్యాసము ఇవ్వండి అన్నాడు. ఏమయ్యా! సన్యాసమంటే మాటలా? నియమ నిష్ఠలు చాలా అవసరము. అసలు సన్యసించవలెనని ఎందుకు అభిప్రాయం కలిగింది అని అడిగారు స్వామీజీ. ఇంట్లో గొడవల వలన సన్యసించాలనుకున్నానన్నాడు. ఎవరితో గొడవ అని స్వామివారు ప్రశ్నించారు. ఇంకెవరితో స్వామీ నా భార్యతోనే అన్నాడు. సరే సన్యాసం

ఇస్తాము. మీభార్య ఈ విషయం తెలుసుకొని క్షమించండి ఏదో జరిగిపోయింది ఇంటికి రండి అని ప్రాధేయపడితే అప్పుడు ఏమి చేస్తావు అన్నారు శ్రీ స్వామీజీ. అప్పటి సంగతి అప్పుడు ఆలోచించుకోవచ్చు అని అతని సమాధానం. ఇంటికి వెళ్ళుటకు సిద్ధమని అర్థము. చూశారా వైరాగ్యాలు ఎంత గట్టితనము గలిగియున్నాయో.

శ్మశాన వైరాగ్యం : అనగా శవాన్ని శ్మశానము వరకు సాగనంపు సందర్భములో రేపు మనము కూడా పోవలసిందే గదా! ఈ సంపదలు వదిలిపోవాలి గదా? ఈ మిద్దెలు మేడలు మన వెంట రావు గదా? అని అన్న వ్యక్తి మరుసటి రోజే పక్క వాని ఖాళీ స్థలమును ఆక్రమించుటకు ప్రయత్నించువారు లేకపోలేదు. శ్మశానము వరకే వైరాగ్యము పరిమితం. ఇంటి వరకు కూడా వుంచుకోరు.

పురాణ వైరాగ్యం : పురాణం వింటూ తలవూపుతూ అంతా మిథ్యే. ఏదీ మనది కాదు. అంతా దైవనిర్ణయము. డబ్బుపై ఆశ వదులుకోవాలి అని ఇంటికొస్తాడు. భార్యతో మీ నాన్న కట్నం డబ్బులు సగం ఇవ్వాలి గదా? నీవు మీ నాన్న వద్దకెళ్ళుము.. కట్నంతోనే తిరిగి రావాలి, లేకపోతే రావద్దు. విడాకులిస్తాను. ఇలా ఏడిపించే పురాణ వైరాగ్యపరులు కూడా వుంటారు.

ప్రసూతి వైరాగ్యం : అనగా తల్లి ప్రసవ వేదనతో బాధపడుతూ సంసారము నరకము. బిడ్డలు దండగ. నేనెందుకు వుండగ ఈ బాధలెందుకు అంటూ ప్రసవం కాగానే ఆ బిడ్డ అరుపుతో వైరాగ్యం సెలవు పుచ్చుకొని పారిపోతుంది. రకరకాల వైరాగ్యాలు ఉన్నవి. బిడ్డలు చెప్పిన మాట వినకపోతే బిడ్డలపైన వైరాగ్యం, ఆగ్రహం అన్ని సమపాళ్ళలో వుంటాయి. జ్ఞానముతో కూడిన వైరాగ్యమే నిజమైన వైరాగ్యము. అట్టి వైరాగ్యమే, సమాజమునకు సదా అవసరం. జై శ్రీ కృష్ణభగవానునికి జై,

జై శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారికి జై, శ్రీ శ్రీరామ -వాసుదేవ.

వార్తలు

(01). పూజ్య శ్రీ వివేకానన్దస్వాములవారు ప్రపంచ మతమహాసభలో చికాగోలో ఉపన్యసించి 125 సంవత్సరాలయిన సందర్భంగా కడప, అనంతపురం, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో స్వామి వివేకానన్ద రథయాత్ర సందర్భంగా 05-11-2019వ తేది రథం శ్రీకాళహస్తికి వచ్చినది. 14 అడుగులు ఎత్తుగల రథంపై నిలువెత్తు శ్రీ స్వామి వివేకానన్ద ఫోటోతో రథం, భక్తుల కోలాటాలు, భజనలు, విద్యార్థులు, పురప్రజలు, ప్రముఖులు ముందు నడువగా శ్రీకాళహస్తిలోని ముఖ్యమైన నాల్గు వీధుల యందు ఊరేగింపు అయి చివర 'ది స్కూలు' గ్రౌండుకు చేరినది. అచటి విశాలమైన పెండాల్సులో శ్రీరామకృష్ణ మఠం స్వామిజీలు శ్రీమత్ దివ్య ధర్మాత్మానంద స్వామీజీ మహరాజ్, శ్రీమత్ సుజ్ఞేయానంద స్వామీజీ మహరాజ్, ఇంగ్లీషు లెక్చరర్ శ్రీమతి తారాలక్ష్మి, హెడ్‌మాస్టర్ గోపిగార్లు ఉత్తేజ పూరిత వివేకానన్ద సందేశాలు అందజేసిరి. పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు అధ్యక్షత వహించిరి. అట్లే స్వామి విద్యాప్రకాశానంద బాలికలు జూనియర్ కళాశాలలో మఱియు బాలుర జూనియర్ కళాశాలలో యువతకు శ్రీ స్వామీజీలు వివేకానన్ద సన్దేశాల ప్రవచనలు చేసిరి. మధ్యాహ్నం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో కార్తీక వనభోజనాలు జరిగినవి.

(02). 12-11-2019వ తేది కార్తీకపౌర్ణమినాడు ఆశ్రమంలో గురుపాదుకాపూజ, వనభోజనాలు జరిగినవి. ఆశ్రమంలో జరుగుచుండిన చాతుర్మాస్య వ్రతము ఈ రోజుతో సమాప్తమైనది ఈ చాతుర్మాస్య వ్రతంలో పూజ్యశ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు ఉదయం, సాయంకాల సత్సంగములలో వేదాన్త పఞ్చదశి, భాగవతం ఏకాదశ స్కంధంలో జ్ఞానకాండలపై ప్రవచనలు చేశారు.

(03). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో అక్టోబర్ నెలలో ఓ.పి. విభాగంలో **556** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **70** మందికి కళ్ళలో పొరలు తీసివేసి లెన్సు అమర్చబడినవి. **7** మందికి యాగ్ లేజర్ చికిత్స చేయబడింది.

రథయాత్రలో "ది స్కూల్" గ్రౌండులో విద్యార్థులకు
శ్రీ రామకృష్ణమఠం స్వాములవారి ఉపన్యాసం

భరధ్వాజ తీర్థంలో కార్తిక వనభోజనాలను
శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు ప్రారంభించుట.

Scanned by CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 December 2019 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-11-2019, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము
భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఆపరేషన్ థియేటర్‌లో కంటి ఆపరేషన్ చేయుట

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Scanned by CamScanner